క్లుప్తంగా

జోనల్ స్థాయిలో విద్యార్థుల ప్రతిభ



డిబేట్‌లో విజేతలకు ప్రథమ బహుమతి అందజేస్తున్న ఆర్‌జేడీ నాగమణి

సామర్లకోట: జాతీయ కాంస్టిట్యూషన్ డేను పురస్కరించుకుని నిర్వహిస్తున్న పోటీల్లో నవర జిల్లా పరిషత్ విద్యార్థులు దూసుకుపోతున్నారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో బహుమతులు సాధించిన విద్యార్థులు.. సోమవారం కాకినాడలో జరిగిన జోనల్ స్థాయిలోను తమ ప్రతిభను కనబర్చారు. ఈ మేరకు డిబేట్‌లో నవర హైస్కూల్‌కు చెందిన శ్రీసత్య, అపర్ణ జోనల్ స్థాయిలో ప్రథమ బహుమతి సాధించారు. పాటల పోటీల్లో చక్రవేణి తృతీయ బహుమతి సాధించింది. విజేతలకు విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి బహుమతులు అందజేశారు. బహుమతులు సాధించిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ సత్యవతి, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు అభినందించారు.

కరాటే పోటీల్లో ప్రతిభ


కరాటేలో తృతీయ బహుమతి పొందిన వర్షితతో తల్లిదండ్రులు, కోచ్

సామర్లకోట: అనంతపురంలోని అశోక్‌నగర్, డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ఆది, సోమవారాల్లో నిర్వహించిన ఇంటర్ డిస్ట్రిక్ స్కూల్ గేమ్స్ కరాటే పోటీల్లో స్థానిక విద్యార్థి మంచి ప్రతిభ కనబర్చింది. స్థానిక విశాలాక్షినగర్‌కు చెందిన వర్షిత లక్ష్మీపద్మావతి అండర్–14 విభాగం బాలికల చాంపియన్‌షిప్ పోటీలో సత్తా చాటి తృతీయ బహుమతి సాధించింది. ఈ మేరకు బాలిక తల్లిదండ్రులు శ్రీదేవి, సూర్య ఉదయభాస్కర్ సోమవారం సాయంత్రం విలేకర్లకు వివరాలు తెలిపారు. బాలిక స్థానిక భాష్యం పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. కరాటే కోచ్ శంకర్, జాతీయ పర్యావరణ మిత్ర తోటకూర గంగాధర్, ప్రిన్సిపాల్ సూర్య, కాలనీ వాసులు బాలికను అభినందించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి


పొన్నాడలో గృహ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రవికుమార్

కొత్తపల్లి: లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ రవికుమార్ సూచించారు. మండలంలోని పొన్నాడలోని ప్రభుత్వ లేఅవుట్‌లో జరుగుతున్న గృహ నిర్మాణాలను సోమవారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారులకు గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించారు. ఆయన వెంట గృహ నిర్మాణ శాఖ సిబ్బంది ఉన్నారు.

కల్యాణ మండపానికి షెడ్డు నిర్మాణం


షెడ్డును ప్రారంభిస్తున్న డాక్టర్ చందలాడ తదితరులు

సామర్లకోట: పట్టణంలోని మంతం సెంటర్‌లో ఉన్న శ్రీవీరభద్ర రామాలయంలో దాత మన్యం కూర్మనాథ్, డాక్టర్ వాణి దంపతుల సహకారంతో కల్యాణ మండపానికి షెడ్డు నిర్మించారు. శ్రీరామ నవమి సందర్భంగా రాముల వారి కల్యాణం జరిగే సమయంలో భక్తులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, వారి సౌకర్యార్థం ఈ షెడ్డు నిర్మించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ చందలాడ అనంతపద్మనాభం దీనిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్లు గోలి వెంకట అప్పారావు చౌదరి, యార్లగడ్డ చిన్ని, రైతు సంఘం అధ్యక్షుడు కంటే బాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, కౌన్సిలర్ బలుసు వాసు, ఆలయ ధర్మకర్త యార్లగడ్డ బాపినీడు తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

సామర్లకోట: రైల్వే పీడబ్ల్యూ కార్యాలయం సమీపంలో ఉన్న కనకదుర్గ ఆలయం వద్ద సోమవారం భారీ అన్న సమారాధన జరిగింది. శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని పీడబ్ల్యూఐ రామసుబ్బారావు, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రవికాంత్ ప్రారంభించారు. రైల్వే క్వార్టర్స్‌లోని ఉద్యోగులు, రైల్వే అధికారులు, కార్మికులు, ఆర్పీఎఫ్ సిబ్బంది, రైల్వే ప్రయాణికులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం రమేష్, ఎస్ఎస్ అనంతలక్ష్మి పాల్గొన్నారు.

ఆహారం... ఆరోగ్యం

- ప్రకృతి వ్యవసాయంలో ఘన విజయం
- 100 టన్నుల ఘన జీవామృతం తయారీ
- జిల్లాలో పంపిణీకి చర్యలు


ఘన జీవామృతం తయారీని పర్యవేక్షిస్తున్న అధికారులు


ఘన జీవామృతం తయారు చేస్తున్న రైతులు

పిఠాపురం: జీవన గమనంలో ఒత్తిడి పెరిగింది.. కాసేపు సరదాగా కూర్చునే రోజులు పోయాయి.. ఈ నేపథ్యంలో మానసిక ప్రశాంతత కరవై అనేక ఆరోగ్య సమస్యలు ముప్పేట దాడి చేస్తున్నాయి. అలాగే సాగులో రసాయనక ఎరువులు, పురుగు మందుల వాడకం పెరగడంతో తినే ఆహార ఉత్పత్తులు కలుషితమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యవంతమైన ఆహార ఉత్పత్తులను పండించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాకినాడ జిల్లాలో ప్రకృతి వ్యవసాయం పెంచడంలో భాగంగా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఘన జీవామృతం తయారీకి జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు వినూత్న ప్రయత్నం చేశారు. ఇందులో ఘన విజయం సాధించారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖాధికారి ఎలియాజర్ ఆధ్వర్యంలో పలువురు ప్రకృతి వ్యవసాయ రైతులు బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా వంద టన్నుల ఘన జీవామృతం తయారీకి పూనుకున్నారు. ఈ రైతులు కేవలం వారం రోజుల్లో 100 టన్నుల ఘన జీవామృతం తయారు చేసి రికార్డు సృష్టించారు.

అవగాహన కల్పించేందుకు..

చేబ్రోలులో తయారు చేసిన వంద టన్నుల ఘన జీవామృతాన్ని జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేసే ఉత్సాహం ఉన్న రైతులకు పంపిణీ చేయడం ద్వారా ఈ సాగును పెంచడానికి చర్యలు తీసుకుంటున్నారు. ప్రకృతి వ్యవసాయంతో అటు రైతులకు తక్కువ పెట్టుబడితో సాగు పూర్తవ్వడంతో పాటు ఎక్కువ ఆదాయం వస్తుందన్న విషయాన్ని తెలపడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇది ఎంతో ఉపయుక్తం కానుందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే గొల్లప్రోలు మండలంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు నిర్వహిస్తున్న గుండ్ర శివచక్రం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సాగుదారులను పెంచే కార్యక్రమం విజయవంతంగా నడుస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఇదో బృహత్తర కార్యక్రమం



చాలా మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ఉత్సాహం చూపిస్తుండడంతో ఘన జీవామృతం సరఫరా చేయాలని నిర్ణయించి ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టాం. దీనిని రైతులు విజయవంతం చేశారు. జిల్లాలో ఉత్సాహం ఉన్న రైతులకు దీనిని సరఫరా చేసి వారికి ప్రకృతి వ్యవసాయం పట్ల మక్కువ కలిగేలా చర్యలు తీసుకున్నాం. ఈ సాగు రైతులు సమష్టిగా సాగడం వల్ల ఇది సాధ్యమైంది. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తాం. రైతుల సహకారం చాలా బాగుంది. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన పంటలకు మంచి మార్కెటింగ్ కూడా ఉండడంతో ఈ వ్యవసాయం వైపు అడుగులు వేస్తున్నారు. ఆరోగ్యకర పంటలను పండించడంతో పాటు భూసారాన్ని పెంచి భూమికి పూర్వ సత్తువను తీసుకు రావడానికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇది భవిష్యత్తు తరాలకు మంచి భూమిని అందించడానికి తీసుకునే చర్యల్లో భాగమే.

– ఎలియాజర్, జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖాధికారి, కాకినాడ

కొత్తపల్లి మండల అధికారులు

తహసీల్దార్	91542 47464
ఎంపీడీఓ	94401 13090
ఇంజినీర్	99890 78030
ఎలక్ట్రికల్ ఏఈ	94408 12642
హౌసింగ్ ఏఈ	70939 30455
ఈఓపీఆర్డీ	99489 27333
ఉపాధి హామీ పథకం ఏపీఓ	83744 46378
డ్వాక్రా ఏపీఎం	89788 81622
ఎస్సై	94409 00752
సీఐ పిఠాపురం	94407 96523
వ్యవసాయ శాఖ ఏఓ	83310 56594
కొత్తపల్లి పీహెచ్‌సీ డాక్టర్	99890 69546
నాగులపల్లి పీహెచ్‌సీ డాక్టర్	98497 28671
కొమరగిరి పీహెచ్‌సీ డాక్టర్	92466 90633
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ	89858 28380
ఎంఈఓ	92467 34465
ఐసీడీఎస్ సీడీపీఓ	94408 14692
ఇరిగేషన్ జేఈ	83310 75078

సామర్లకోట అధికారుల ఫోన్ నంబర్లు

మున్సిపాలిటీ

మున్సిపల్ కమిషనర్	98499 05808
మున్సిపల్ మేనేజర్	98499 07118
మున్సిపల్ డీఈ	96769 68282
మున్సిపల్ ఏఈ	98499 07122
మున్సిపల్ ఆర్వో	98499 07120
మున్సిపల్ ఆర్ఐ	90146 00920
మున్సిపల్ టీపీఓ	98499 07123
శానిటరీ ఇన్‌స్పెక్టర్	77024 48282
అకౌంట్స్ ఆఫీసర్	98499 02447

చేనేత కార్మికుల ఆందోళన


తహసీల్దార్ చిన్నారావుకు ఫిర్యాదు చేస్తున్న చేనేత కార్మికులు

కొత్తపల్లి: స్థానిక శివారు రవీంద్రపురం రామలింగేశ్వర కాలనీలో చేనేత కార్మికులు ఉమ్మడిగా పడుగు పనులు, హల్లులు పట్టుకునే ఖాళీ స్థలాన్ని ఒక ప్రైవేట్ సర్వేయర్ ఆక్రమించి గ్రావెల్ డంప్ చేశారంటూ చేనేత కార్మికులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఆక్రమించేందుకు ప్రయత్నించిన ప్రైవేట్ సర్వేయర్‌పై చర్యలు చేట్టాలని వారు తహసీల్దార్ చిన్నారావుకు ఫిర్యాదు చేశారు. 1984లో రవీంద్రపురంలో సర్వే నంబర్ 59లో 2.30 సెంట్ల భూమిని కొనుగోలు చేసి 55 మంది చేనేత కార్మికులు ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. సామాజిక స్థలంలో బావి ఏర్పాటు చేసుకున్నారు. ప్రభుత్వ మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయడంతో బావి వినియోగం తగ్గింది. దీంతో కార్మికులు అందరూ ఉమ్మడి ఖాళీగా ఉన్న స్థలంలో చేనేతకు సంబంధించి పడుగులు, హల్లులు నడుతూ జీవనోపాధి పొందుతున్నారు. ఈ స్థలం ఖాళీగా ఉందని తెలుసుకున్న ప్రైవేట్ సర్వేయర్ ఆక్రమించుకునేందుకు గ్రావెల్ డంప్ చేశారంటూ చేనేత కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పూర్తి స్థాయిలో సర్వే చేసి స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అన్నారు.

పొలంబడిపై రైతులకు అవగాహన ఉండాలి

జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్

సామర్లకోట: రైతులకు పొలంబడి కార్యక్రమాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని నవర గ్రామంలో ఎంపీటీసీ ఐ.సత్య అధ్యక్షతన జరిగిన ఇండిగ్యాప్ పొలంబడి క్షేత్ర దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 14 వారాల పాటు నిర్వహించిన పొలంబడి ప్రాముఖ్యాన్ని వివరించారు. ఇది రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. పొలంబడిలో నేర్చుకున్న అంశాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. పొలంబడిని నవర గ్రామంలో 30 మంది రైతులతో 25 ఎకరాల్లో నిర్వహించినట్టు ఏడీఏ ఎస్.రత్న ప్రశాంతి తెలిపారు. పొలంబడిలో తగిన సాంకేతికతను జోడించి నూతన శాస్త్రీయ పద్ధతులను రైతులకు వివరించినట్టు చెప్పారు. పొలంబడిలో ఏడాది పాటు 15 మంది రైతులతో సేంద్రియ వ్యవసాయం చేసేందుకు ఆమోదం పొందారు. పొలంబడిపై ప్రత్యేక శ్రద్ధ చూపిన రైతులు వెన్నా వీరవెంకట సత్యనారాయణ, కేశవరపు సురేష్, పడాల వెంకటరమణను వ్యవసాయాధికారులు సత్కరించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా


ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న స్వచ్ఛమైన స్నేహం గ్రూప్ సభ్యులు

కొత్తపల్లి: ఉప్పాడ బీచ్ వేదికగా ఏపీ, తెలంగాణ ప్రాంతాల వాసులంతా ఒకటిగా కలుసుకుని ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. ఇక్కడి మూలపేట బీచ్‌లో స్వచ్ఛమైన స్నేహం ఫేస్‌బుక్ ఫ్రెండ్స్ గ్రూప్ కార్తిక వన సమారాధన సోమవారం జరిగింది. దీనికి సుమారు రెండొందల మంది ఫేస్‌బుక్ ఫ్రెండ్స్ హాజరయ్యారు. ముందుగా వీరంతా ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం అందరూ కలసి ఆడి పాడారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ రకాల ఆటలు ఆడి విజేతలకు బహుమతులు అందించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సందడిగా గడిపారు. అందరూ కలసి ఫోటోలు దిగారు. ఎక్కడెక్కడివారో కలిసి ఈ కార్యక్రమం పూర్తవ్వగానే వెళ్లిపోతూ ఒకరికొకరు వీడిపోలేమంటూ అందరూ తమ మనసులోని భావాలను తెలుపుకొన్నారు. ప్రముఖ కెమెరా మెన్‌శ్రీనివాస్ గంటా గ్రూప్ సభ్యులను తన ఫొటోలతో మెస్మరైజ్ చేశారు. ఈ కలయికకు సుమారు రెండు నెలల నుంచి తమ వంతు కష్టపడుతున్న గ్రూప్ అడ్మిన్‌లు చనుమోలు అన్నపూర్ణ, నాగు, క్రియేటర్ మహేష్ పట్నాల, అనాల సుదర్శన్‌లను గ్రూప్ సభ్యులు సన్మానించారు. వర్మ, జగన్మోహన్‌మిర్యాల, వాసు గ్రంధి, రాంబాబు చల్లా, ఉజ్వలరెడ్డి, వెంకటశేషగిరిరావు, పాల్గొన్నారు.

మినరల్ ప్లాంట్లను తనిఖీ చేయాలి

కమిషనర్‌కు మానవ హక్కుల నేతల వినతి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మానవ హక్కుల సంఘ నాయకులు

సామర్లకోట: పట్టణంలో పెరుగుతున్న మినరల్ వాటర్ ప్లాంట్లను తనిఖీ చేయాలని జిల్లా మానవ హక్కుల సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యకు వినతిపత్రం అందజేశారు. గతంలో 20 లీటర్ల కేన్‌కు రూ.ఐదు వసూలు చేసే వారని, దానిని వారు ఇష్టం వచ్చిన రేట్లకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. మినరల్ వాటర్ ప్లాంటులో నీరు శుద్ధి అవుతుందా, లేదా అనే తనిఖీలు చేసేవారు లేకపోవడంతో వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వాటర్ ప్లాంట్లు నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నదీ, లేనిదీ పరిశీలించాలన్నారు. ఆయనతో సంఘ సభ్యుడు కుంచే నానిబాబు ఉన్నారు. కాగా వీర్రాఘవపురంలోని లేఅవుట్‌లో నిరుపయోగ స్థలంలో నీరు నిలిచి, పందులు సంచరించడంతో దోమలు పెరిగిపోతున్నాయని అదే ప్రాంతానికి చెందిన నాగేశ్వరరావు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ప్రాంతాన్ని పరిశీలించి, నీరు పోయేలా డ్రైనేజీని ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత ప్రజలు విజ్ఞప్తి చేశారు.

నవర గ్రామ సభలో 44 అర్జీలు

సామర్లకోట: రైతుల కోసం ప్రతి గ్రామంలోను ఏర్పాటు చేస్తున్న భూ రీ సర్వే అవగాహన సదస్సుల్లో భాగంగా సోమవారం నవర గ్రామంలో జరిగింది. ఇందులో 44 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ కొప్పూరి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. సబ్ డివిజన్ చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని 4, పట్టాదారు పాస్ పుస్తకంలో పేరు మార్పు కోసం 4, భూ విస్తీర్ణం తగ్గిందని 33, భూమి స్వభావం మార్చమని ఒకటి, సర్వే నంబరు తప్పుగా ఉందని రెండు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ వివరించారు. . ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వై శ్రీనివాసు, మండల సర్వేయర్ పి.సీతారామాచార్యులు, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రాన కార్తిక కాంతులు

- శివనామ స్మరణతో పోటెత్తిన భక్తులు
- కార్తిక దీపాలతో సందడి


పంచారామ క్షేత్రంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


పంచారామ క్షేత్రంలో స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు


పంచారామ క్షేత్రంలో క్యూలో కిక్కిరిసి ఉన్న భక్తజనం

సామర్లకోట: బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి వేంచేసి ఉన్న స్థానిక పంచారామ క్షేత్రం భక్తుల శివనామ స్మరణతో మార్మోగింది. కార్తిక మాసం చివరి సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఉచిత, రూ.20, రూ.50 రూ.100 క్యూలలో భక్తులు బారులు తీరారు. ఈఓ. భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో తెల్లవారుజాము 3 గంటలకు ఆలయంలో గోపూజ అనంతరం స్వామి వారికి తొలి అభిషేకం, తొలి పూజలు నిర్వహించారు. తొలి అభిషేకం, పూజలను తిలకించడానికి భక్తులు క్యూల్లో వేచి ఉన్నారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజ్‌గోపాల్‌శర్మ, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, సన్నిధిరాజు అంజిబాబు, భాస్కర్, కుమార్ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. తెల్లవారుజామున, రాత్రి ఆలయంలో భక్తులు దీపాలను వెలిగించారు. భక్తులు ఆలయ కోనేరులోను, గోదావరి కాలువలోను పుణ్య స్నానాలు చేసి, దర్శనాల కోసం ఆలయానికి తరలివచ్చారు. కాగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయంలో ధ్వజ స్తంభం వద్ద ఉన్న శివలింగానికి స్వయంగా పంచామృతాలతో అభిషేకాలు చేశారు. స్వామి వారిని, అమ్మవార్లను దర్శించుకున్న ఆయనకు పండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

పంచారామ క్షేత్రంలో గుంటూరు జిల్లా ప్రత్తిపాడు ఎమ్మెల్యే బర్ల రామాంజనేయులు స్వామివారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే దంపతులకు ఆలయ మర్యాదలతో పండితులు స్వాగతం పలికారు. క్షేత్రంలోని ఆలయాలు, మూలవిరాట్, స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

అన్నదానానికి పోటెత్తిన భక్తులు

దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానానికి భక్తులు పోటెత్తారు. స్వామివారు, అమ్మవార్ల దర్శనానికి వచ్చిన భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయంలోని ఉసిరి చెట్ల నీడలో కూర్చుని భోజనాలు చేశారు.

ప్రత్యేకాలంకరణలో భీమేశ్వరస్వామి

కార్తిక మాసం చివరి సోమవారం కావడంతో కుమారారామ భీమేశ్వరస్వామిని సాయంత్రం ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకాలు, పూజలు చేసిన అర్చకులు స్వామి వారిని, అమ్మవారు బాలాత్రిపుర సుందరిదేవిని ప్రత్యేకంగా అలంకరించారు. వచ్చే నెల రెండో తేదీతో కార్తిక మాస ఉత్సవాలు ముగుస్తాయి. డిసెంబర్ ఒకటిన అమావాస్యను పురస్కరించుకుని ఆలయంలో కోటి దీపోత్సవం ఉంటుంది. రెండో తేదీన స్వామి వారికి వెండి జటాఝూటం అలంకరణతో ఉత్సవాలను ముగిస్తారు.

ఆకట్టుకున్న జ్యోతిర్లింగార్చన

పంచారామ క్షేత్రంలో సోమవారం రాత్రి దీపారాధన సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన భక్తులను ఆకట్టుకుంది. ఆలయంలో లక్షపత్రి పూజలు చేసుకునే భక్తుల కోసం దీపారాధన సంఘ సభ్యులు జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేస్తారు. పూజల అనంతరం లక్షపత్రి పూజలు చేసుకున్న భక్తులు జ్యోతిర్లింగార్చనలో దీపాలు వెలిగించారు.


అంతటా శివోహం..

- మార్మోగిన శివనామ స్మరణ
- ఆలయాల్లో భక్తుల సందడి


పాదగయలో కుక్కుటేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేస్తున్న పండితులు

పిఠాపురం: కార్తిక మాసం నాల్గవ సోమవారం సందర్భంగా పిఠాపురం పాదగయ పుణ్యక్షేత్రం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి ఉమా కుక్కుటేశ్వర స్వామి, పురుహూతిక అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. ఈ ఏడాది కార్తిక మాసం ప్రారంభం నుంచి పిఠాపురం పరిసర ప్రాంతాల ప్రజలు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని దత్తాత్రేయ కల్యాణ మండపంలో పలువురు భక్తులు ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. కార్తిక సోమవారం సందర్భంగా ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో దేవదాయ శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామివారికి లక్షపత్రి పూజలు, అభిషేకాలు, మంత్రపుష్పాలు, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. పట్టణంలో సోమేశ్వర స్వామి, సకలేశ్వరస్వామి తదితర ఆలయాల్లో, భోగాపురం, పి. దొంతమూరు, చిత్రాడ, విరవాడ, మల్లాం, రాయవరం, గొల్లప్రోలు మండలం దుర్గాడ రామలింగేశ్వరస్వామి, తాటిపర్తి అపర్ణాదేవి ఆలయాల్లో భక్తులు పోటెత్తారు.


భక్తులతో కిటకిటలాడుతున్న పాదగయ క్షేత్రం


పాదగయ క్షేత్రంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సర్వేశ్వరా.. శుభకరా


కొత్తపల్లి: మండలంలోని శివాలయాలు సోమవారం శివనామ స్మరణతో మార్మోగాయి. తెల్లవారు జాము నుంచి భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. కొత్తపల్లిలోని బాలాత్రిపుర సుందరి రాజశేఖరస్వామి, ఉప్పాడలోని మత్స్యలింగేశ్వరస్వామి, చౌడేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి, భ్రమరాంబ సమేత వీరమల్లేశ్వరస్వామి, గొర్స, యండపల్లి, నాగులాపల్లి తదితర గ్రామాల్లో ఉమారామలింగేశ్వర స్వామి ఆలయాలతో పాటు కొత్తపల్లిలోని శ్రీరుక్మిణీ సమేత వేణుగోపాల స్వామి, ధర్మశాస్త్రా ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. కార్తిక మాసం కావడంతో మహిళలు ఆవు నెయ్యితో తయారు చేసిన దీపాలను, ధ్వజస్తంభం, రావిచెట్టు, తులసి చెట్ల వద్ద వెలిగించి పూజలు చేశారు.


రామలింగేశ్వరస్వామికి దీపాలతో అలంకరణ


ఉప్పాడ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు


సామర్లకోట పంచారామ క్షేత్రంలో తొలి అభిషేకం చేస్తున్న అర్చకులు


ఉప్పాడలో చౌడేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు


పంచారామ క్షేత్రంలో ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన